

# బ్రతక నేర్వని వాళ్ళు

పెద్దగా రొద చేసుకుంటూ వెళ్ళి పోతున్న సిటీబస్సులు.

కొంపలు మునిగిపోతున్నట్టుగా అతి వేగంగా పరిగెత్తే కారులు.

తమాషాకి సైలెన్సరు తీసేసి, చెవులు గింగుర్లెత్తేటంత శబ్దంతో మోటారు సైకిళ్ళమీద వెళ్ళే కాలేజీకుర్రాళ్ళు.

పేవ్‌మెంటుమీద నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూ స్కూలుకు పోతున్న చిన్నపిల్లలు.

రోడ్డుకు ఒక పక్కగా అతి జాగ్రత్తగా నడుస్తున్న ముసలివాళ్ళు.

కిటికీలోంచి బయటకు చూస్తున్నాను. ఎటు చూసినా నవ్వే మొహాలు కనిపిస్తున్నాయి. వీళ్ళంతా నిజంగా సంతోషంగా ఉన్నారా? నా కేమాత్రం నమ్మకం లేదు. నవ్వుమొహం ముసుగు తగిలించుకొని తిరుగుతున్న మోసగాళ్ళు. ఈ వెధవలంతా తమను తామే మోసం చేసుకుంటున్నారు. ఎవరికి తెలియని వేషాలివి!

అదుగో, తంచనుగా తొమ్మిదయే సరికల్లా ఈ రోడ్డంట వెళ్ళే జంట వస్తోంది.

మహాతల్లి— చవక రకం వాయిలు చీర కట్టుకొంది. అసలు, ఈ అమ్మాయి కున్నవి రెండే చీరలనుకుంటాను. ఒకటి— ఎరుపుది; రెండోది నీలంది. ఎప్పుడు చూసినా ఈ రెండు చీరల్లో ఏదో ఒకటి కట్టుకొని ఉంటుంది. ఈ రోజు ఎరుపుచీర కట్టుకు వస్తోంది. అంటే, రేపు నీలం చీరన్న మాట. పక్కగా నడుస్తున్న దేభ్యంగాడు మొగుడనుకుంటాను. కాలరు దగ్గర మురికి పట్టిపోయిన వెధవ చొక్కా వేసుకొని పెద్ద దర్జాగా బయలుదేరుతాడు.

కట్టుకోవడానికి సరైన చీర లేకపోయినా, ఒంటిమీద చిన్నమెత్తు బంగారం లేకపోయినా, ఆ అమ్మాయి మొహంలో ఎందుకంత ఆనందం కనిపిస్తోంది? ఏడ్చింది, ఆనందం లేదూ, పాడూ లేదు. పైకి వేషాలు. ఏడవలేక నవ్వటం.

అసలు, ఆ మొగుడిగాడికి సిగ్గుందా? పెళ్ళానికి కావలసినవి కొనివ్వలేని వాడు పెళ్ళెందుకు చేసుకొన్నాడో? పైగా, ఆ అమ్మాయిచేత ఉద్యోగం చేయిస్తాడు. సాయంకాలాలు పిల్లిద్దరి మొహాలు చూడాలి. తడ్డోడుతూ, వాడిపోయిన మొహాలతో ఇంటికి పోతుంటారు.

ఆ అమ్మాయి పేరు నాకు తెలియదు కాని, సౌకర్యం కోసం పెద్దమ్మ అని పెట్టేశాను. మొగుడిపేరు దేభ్యంగాడు.

పెద్దమ్మని, దేభ్యంగాడిని చూసి నప్పుడల్లా విడదీయలేని చిక్కు సమస్య ఒకటి నా బుర్రలో మెదులుతుంది— తన జీతంమీద తను బ్రతుకుతూ, ఈ పెద్దమ్మ ఇంకా వాడిని పట్టుకు వేళ్ళాడటం దేనికీ అని.

ఏమిటో వెధవ మనుష్యులు. . . బ్రతకటం చేతగాక జీవితాన్ని ఏదో ఓ గాడిలో లాగేస్తున్నారు.

ఇంట్లోకూడా ఈ పెద్దమ్మా, దేభ్యంగాడూ ఇలాగే నవ్వుతూ ఉంటారా? దారిలో పూలు కొనుక్కుందా మంటుంది పెద్దమ్మ. "వద్దు. వట్టి దండగ—ఆ డబ్బుంటే రేపు కాఫీ తాగచ్చు" అంటాడు దేభ్యం. మూతి ముడుచుకుంటుంది పెద్దమ్మ. ఇంటికి వెళ్ళగానే వచ్చేట్టు దెబ్బలాడుకుంటారు. మళ్ళీ పొద్దున్నే లోకుల కళ్ళు కప్పడానికి రోడ్డు మీద నవ్వుతూ బయలుదేరుతారు. ఇంటి లోపల ఏడుపులు, ఇంటి బయట నవ్వులు. బాగుంది, చాలా బాగుంది, బలే బాగుంది.

చూడలేనిదానిని ఊహించుకొని మనసారా నవ్వుకున్నాను.

నేనూ, అరుణా ఏ నాడన్నా కీచులాడుకున్నామా? నెవర్! అటువంటిది మా మధ్య జరగడానికి వీలులేదు. బ్రతుకు తీయగా, తేనెలా సాగిపోతున్నప్పుడు కలహాలు, కీచులాటలు ఎందుకు వస్తాయి?

మనిషి హాయిగా బ్రతకడానికి నా అభిప్రాయంలో డబ్బుండాలి. కావలసినంత డబ్బు చేతిలో ఉంటే ఏ సుఖమైనా కొనుక్కోవచ్చు.

డబ్బుతో కొనలేనిది అవతలి వారి మనస్సంటే మాత్రం నేను ఒప్పుకోను. డబ్బుకోసం మనుష్యులు శరీరమే కాదు, మనస్సుకూడా అమ్మేస్తారు. అసలు పేచీ అంతా ధర దగ్గరే. ఒకడు వెయ్యి రూపాయలకు అమ్మేస్తే, మరొకడు లక్ష పుచ్చుకుంటాడు. అంతే తేడా. అలా డబ్బుతో కొన్న మనస్సుల్లోంచి సుఖం రాబట్టుకోలేమా? ఏమిటో, ఆ మాటంటే నన్నో పిచ్చి వెధవగా జమ కట్టేస్తారు వినేవాళ్ళు.

బస్సు కోసం నిలబడ్డ జనంమీద పడింది నా దృష్టి. అలా గంటల తరబడి ఎండలో మాడిపోతూ, రోడ్డుమీది దుమ్ము పీల్చుతూ బస్సు కోసం నిలబడతారేగాని, హాయిగా టాక్సీలో వెళ్ళిపోలేరు. ఇంత చిన్న సుఖంకూడా కొనలేని జనం హాయిగా ఉన్నారంటే ఎలా నమ్మడం?

వీళ్ళందర్నీ చూసినప్పుడల్లా నన్ను వరించిన అదృష్టం మరింత కొట్టొ

వచ్చినట్టు కనపడుతుంది. ఒక్కసారిగా నాలో గర్వం తలెత్తింది. నాలుగు తరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తి. నా ఇంటి ఖర్చు నెలకు మూడు వేలవుతుంది. అయితే మాత్రమేం? నా ఇంటికి వచ్చిన వాళ్లంతా నా డబ్బూ, దర్జా చూసి అసూయపడుతుంటే పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుకుంటాను. వాళ్లను మరింత ఏడిపించడానికి ఇంకొంచెం విచ్చలవిడిగా డబ్బు వెదజల్లుతుంటాను.

నాన్న చనిపోయేలోగా కనీసం ఒక్క మంచి పని చేశారు. నన్ను దత్తత కిచ్చేశారు. లేకపోతే, నేను కూడా చెల్లెలిలాగా నానా కష్టాలూ పడుతూ బ్రతుకుతుండేవాడిని.

"అన్నయ్యా! భోజనం వడ్డించేశాను. వస్తావా?" చెల్లెలి పిలుపుతో వెనక్కు తిరిగాను. బల్ల దగ్గర కూర్చుని భోజనం చేస్తూ రమవైపు చూస్తున్నాను.

పాపం! దాని బ్రతుకు అధ్వాన్నమై పోయింది. డబ్బు లేకపోవడంతో నాన్న దాన్ని ఓ మామూలు ఉద్యోగస్థుడి కిచ్చి పెళ్లి చేశారు. అతగాడి సంపాదన అంతా కలిపి రెండు వందలు మించదు. ఈ కరువురోజుల్లో అదేం సరిపోతుంది? ఎప్పుడైనా నా ఇంటికి వచ్చినప్పుడు నా దర్జా చూసి రమ కళ్లు మెరవటం గమనించాను. ఆ మెరుపు అలాగే ఉండా లనుకొనేవాడిని. ఎందుకంటే అటువంటి మెరిసే కళ్లను చూసినప్పుడల్లా నాకు ఆనందం కలుగుతుంది.

పెళ్లయి నాలుగేళ్లయినా దాని ఒంటిమీద చిన్నమెత్తు బంగారం లేదు. వచ్చిన డబ్బు తిండికి సరిపోతుందను కుంటాను. అది ఏనాడూ మంచి చీర కట్టుకొని ఉండగా చూడలేదు. రమను చూసినప్పుడల్లా నా గుండె చెరువయి పోతుంది పిధవ ముష్టి రెండు వందలతో బ్రతుకు లాగిస్తోంది. ముష్టి రెండు వందలు. రెండు వందలు ముష్టి.

చాలాసార్లు నా మనసులో ఉన్న బాధ రమతో చెప్పాను. ఒకటికి పది సార్లు రెండువందల రూపాయలతో ఎలా బ్రతుకుతున్నావని తరిచి, తరిచి అడిగాను. డబ్బు అవసరమొస్తే నా దగ్గరికొచ్చి తీసుకువెళ్లమని చెప్పాను, (అలా చెప్పడంలో నా కెంతో ఆనందం ఉంది). దానికి జరిగిన అన్యాయానికి నే నెంత కుమిలిపోతున్నానో వివరించాను. ఎదురు సమాధాన మేనాడూ రమ చెప్ప లేదు. అన్నీ నవ్వుతూ వినేది.

ఎంతైనా అది నా చెల్లెలు. ఎన్నాళ్లని మురుగ్గుంటలో బ్రతు కీడుస్తుంది? నెల క్రితం శాశ్వతంగా నా దగ్గరి కొచ్చేసింది. ఆ రోజు దాని కాపురం చెడిపోయిందన్న బాధకన్నా, దానికి సుఖపడే రోజులు వచ్చినందుకు నాకు ఎక్కువ సంతోషం కలిగింది.

ఈ నెల రోజులనుంచి రమ పని అంగరంగ వైభోగంగా ఉంది. చీరలు, నగలు, సినిమాలు, షికార్లు, కోరిన వస్తువు మరు నిమిషంలో చేతికందడం— ఇంత సుఖంగా, హాయిగా బ్రతికే రోజు తన కొస్తుందని ఏ నాడూ రమ ఊహించి ఉండదు.

పరధ్యానంగా అన్నం కెలుకుతూ ఏదో ఆలోచిస్తోంది రమ. వెనకటి సంగతులు గుర్తు కొచ్చి ఉంటాయి. అంత కాలం కళ్లు మూసుకుని గానుగెద్దు జీవితం ఎలా గడిపానా అని ఆలోచిస్తూ ఉండి ఉంటుంది, బహుశా.

"రమా! మీ వదిన ఇంట్లో లేదా? ఎక్కడా అలికిడి అవడం లేదు." రమ ఆలోచనలు చెదరగొట్టుతూ అడిగాను.

"లేదు. ఎవరో స్నేహితురాలింటికి వెళ్లింది" అంటూ అన్నం దగ్గర నుండి లేచింది.

"నా కేమిటో అన్నం తిన బుద్ధి కావడం లేదు." ప్రశ్న లేని జవాబు చెప్పి లోపలికి వెళ్లిపోయింది.

పన్నెండు మంది కూర్చునే డైనింగ్ టేబిల్ముందు నే నొక్కణ్ణే కూర్చుని, వంటవాడు వడ్డిస్తుంటే భోజనం అయిందనిపించాను.

మళ్లీ కిటికీ పక్కగా కూర్చున్నాను.

ఇంకెంత ఇంట్లో ఒంటరిగా ఉండటం అలవాటయిపోయింది. భోజనం కూడా ఎప్పుడూ నే నొక్కణ్ణే చేసేవాడిని. మధ్యాహ్నం భోజనం అవగానే కిటికీ పక్కగా చేరి రాత్రి తొమ్మిదింటి వరకూ రోడ్డుమీద వచ్చే, పోయే మనుష్యుల్ని చూస్తూ గడిపేవాడిని. ఆ తరవాత తిండి తిని, రెండు నిద్రమాత్రలు వేసుకు పడుకొనేవాడిని. అరుణా, నేనూ చాలా అరుదుగా మాట్లాడేవాళ్లం. అరుణకు తన క్లబ్బుగొడవ, స్నేహితురాళ్ల గొడవ తప్ప మరేం పట్టదు. తన సరదాలు తనవి, నా సరదాలు నావి. నాతో లంకె పెట్టుకుంటే తన సరదాలు ఈ జన్మలో తీరవు.

కానీ, రమ వచ్చినప్పటినుండి నా కార్యక్రమంలో కొద్దిగా మార్పు వచ్చింది. రమా, నేనూ కలిసి భోజనం చేసేవాళ్లం. మధ్యాహ్నం నా దగ్గర కూర్చుని ఏవో పుస్తకాలు చదివి వినిపించేది. లేకపోతే తను చూసిన సినిమాకబుర్లు చెప్పేది. అన్నట్టు నేను చూసిన ఆఖరు సినిమా ఏమిటబ్బా? 'సౌత్ పసిఫిక్'. వెధవ సినిమా చూడకపోయినా బాగుండేది.

డబ్బు మనుషులను కొనగలదేమో కాని మనసులను జయించలేదు. బంగారు పంజరం విలువైనదే కావచ్చు. కాని అందులోని జీవికి అది బంధిఖానాయే. హాయి అనేది తాను పొందే అనుభూతిలో ఉంటుంది. ధనం తాత్కాలికంగా మనుషులను ఆకర్షించగలదేమో కాని శాశ్వతంగా బంధించగలది మనస్సే.

ఈ రోజెందుకో ఇంకా రమ రాలేదు. ఒంట్లో ఏమన్నా నలతగా ఉందేమో? ఇందాకా భోజనం దగ్గరకూడా ఉత్సాహంగా లేదు.

కిటికీలోనుంచి రోడ్డు మీది మనుష్యులను చూస్తున్నాను.

ఎవరో చిన్న కుర్రవాడు వెళుతున్నాడు. ఆరేడు సంవత్సరాలకంటె ఎక్కువ ఉండవు. బొద్దుగా, ముద్దుగా ఉన్నాడు. ఉంగరాలు తిరిగిన జుట్టు చిందరవందరగా మొహం మీదకు పడుతూంది. ఇటూ, అటూ దిక్కులు చూస్తూ రోడ్డు మధ్యగా నడుస్తున్నాడు. బహుశా, వాళ్లమ్మకు తెలియకుండా వచ్చేసి ఉంటాడు. వేలెడు వెధవకు ఎంత ధైర్యం! ధైర్యం, ధైర్యం, ధైర్యం ఉండాలి. లేకపోతే బ్రతు కెందుకు? తప్పకుండా ఈ వెధవ వృద్ధిలోకి వస్తాడు. ఏమో? వాడికి చదువు చెప్పించ

మోపిదేవి దుర్గాప్రసాదరావు

టానికి వాళ్ల నాన్న దగ్గర డబ్బుందో, లేదో? డబ్బు లేకపోతే ఖాళీ. వాడు ఆవారా అయిపోతాడు. దీని కిక తిరుగు లేదు.

వాడు వేసుకున్న బట్టలుబట్టి వాడి నాన్న ఆర్థిక స్తోమతు అంచనా వేస్తున్నాను. ఇంతలో ఎదురుగా పెద్ద శబ్దంతో, అతి వేగంగా వచ్చిన లారీ, అతి మోటుగా ఆ పసివాణ్ణి ముద్దు పెట్టుకొంది. క్షణంలో రోడ్డుమీద పెద్ద రక్తపుమడుగు. అందులో ఓ చిన్న మాంసంముద్ద. నిమిషంలో జనం చేరిపోయారు. ప్రాణాల మీది తీపితో డ్రైవర్ పారిపోయాడు.

మైగాడ్! ఎంత పని జరిగిపోయింది! నిమిషం క్రితం ఆ కుర్రవాడు వృద్ధిలోకి వస్తాడా, లేకపోతే ఆవారా అవుతాడా అని ఆలోచించాను. ఇప్పుడు వాడు శాశ్వతంగా ఈ లోకంలోంచి తప్పుకుపోయాడు. బ్రతికి ఉంటే వాడు తప్పకుండా వృద్ధిలోకి వచ్చేవాడు.

ఇక అటు చూడలేక తల తిప్పుకున్నాను.

ఒక విధంగా వాడు అదృష్టవంతుడు. ఈ ఆక్సిడెంటులో కాలో, చెయ్యో వంకరపోయి, జీవితాంతం బ్రతకకుండా చచ్చిపోయాడు. అందరికీ అంతటి అదృష్టం పట్టదు.

మనస్సులో దిగులుగా ఉంది.

సరిగ్గా ఆరేళ్ల క్రితం...అప్పుడు నా వయస్సు ఇరవై నాలుగు సంవత్సరాలు. పెళ్లయి సంవత్సర మయింది.

రెండో ఆట సినిమా 'సౌత్ పసిఫిక్' చూసి కారు డ్రైవ్ చేసుకుంటూ వస్తున్నాను. అంతకు ముందు రాత్రంతా స్నేహితులతో పేకాడుతూ గడపటం వల్ల నిద్ర లేదు. మగతగా ఉంది. ఆ మగతలో ఉండి ఉండి అరుణ నవ్వుతూ కనిపిస్తోంది. రెండు చేతులూ చాచి రమ్మని ఆహ్వానిస్తోంది. సినిమాకు వెళ్లే ముందు తిన్న కోడిబిర్యాని వాసన త్రేన్పు వచ్చినప్పుడల్లా కమ్మగా ముక్కులోకి దూరుతూంది. అరుణ...జాకెట్టు, బాడీ లేని అరుణ. మగత...కోడిబిర్యానీ. . .

ఎంత దూరం వచ్చానో గుర్తులేదు. ఒక్కసారిగా 'ఢాం' అన్న పెద్ద శబ్దంతో పాటు, వెన్నెముక కలుక్కుమనడం, నేను స్పృహ తప్పిపోవడం జరిగాయి.

నాలుగైదు రోజుల తరవాత హాస్పిటల్లో కళ్లు తెరిచాను. ఒళ్లంతా కట్లు. కదలడానికి వీలులేకపోయింది. అప్పుడు అరుణ చెప్పితే తెలిసింది— ఆ రోజు నేను లారీని గుద్దానని.

రెండు నెలల తరవాత హాస్పిటల్ నుండి బయట పడ్డాను. గాయాలన్నీ నయమయ్యాయి. కానీ, వెన్నెముక పూర్తిగా విరిగిపోవడంతో నడుం దగ్గర నుండి క్రిందిభాగం కదల్చలేను.

అంతే, ఆ రోజునుంచి నా జీవితం చక్రాలకుర్చీకి అంకితమయిపోయింది.

ఈ ఆరు సంవత్సరాలనుంచి పూర్తిగా నౌకర్లకు, డాక్టర్లకు బందీనయ్యాను. వాళ్ల దయాదాక్షిణ్యాల మీద బ్రతుకుతున్నాను.

డామిట్! ఈ రోజెందుకో మనస్సు చెదిరిపోతూంది. లేకపోతే నౌకర్ల, డాక్టర్ల దయమీద నేను బ్రతకడమేమిటి? నాన్సెన్స్! నా దయా దాక్షిణ్యాలమీదే వాళ్లు బ్రతుకుతున్నారు. తలుచుకుంటే వీళ్లందర్నీ పీకేసి కొత్తవాళ్లను పెట్టుకోగలను.

బాధగా కణతలు నొక్కుకున్నాను.

అరుణ వచ్చినట్టుంది. ఎవరిమీదో కేకలేస్తూంది.

డామిట్! తనూ, తన స్నేహితులూ, షికార్లూ తప్ప నా సంగతి పూర్తిగా మరిచిపోయింది. డబ్బు అవసరమొస్తే తప్ప, నేనో మనిషిని ఉన్నాననే సంగతే గుర్తుకు రాదు.

అసలు ఆడది డబ్బూ, కాళ్లూ లేని మొగుడితో కాపురం చేస్తుందా? చెయ్యదు. చచ్చినా చెయ్యదు. డబ్బుతో మనిషిని కొనవచ్చుననే నా అభిప్రాయానికి ఉదాహరణగా అరుణను చూపించవచ్చు. ఆ డబ్బే లేకపోతే పెళ్లాంకూడా నన్ను వదిలేసి ఉండేది.

"రామయ్యా! టీ తీసుకురా!" పెద్దగా కేక వేశాను.

కారుప్రమాదం నుండి బ్రతికి బయటపడ్డాక చూడటానికి బంధువులు, స్నేహితులు అందరూ వచ్చేవారు. అందరూ సానుభూతి చూపించేవాళ్లే. వెధవ సానుభూతి ఎవడు కావాలని ఏడ్చాడు!

నా చిన్నతనంలో మా ఇంటి పక్కన డబ్బులేని వెధవ ఒకడుండేవాడు. వాడి కేమయిందోగానీ, రెండు కాళ్లూ తొడల వరకూ తీసేశారు. కాళ్లుపోయిన రెండు నెలల్లో వాడి పెళ్లాం ఎవడితోనో లేచిపోయింది. కొడుకులు తండ్రిని వదిలి వేరే ఊరు వెళ్లిపోయారు. ఎవ్వరూ వాడి ఇంటికి వచ్చేవాళ్లు కాదు.

కానీ, నా సంగతి — నే నెక్కడకూ కదలలేను కాబట్టి, బంధువులు, స్నేహితులు నా దగ్గరి కొస్తారు. వాడికి డబ్బు లేదు. నాకు డబ్బుంది. నాకూ, వాడికి తేడా డబ్బు దగ్గర. వాడికి, నాకూ తేడా డబ్బు దగ్గర.

ఖాళీకప్పు బల్లమీద పెడుతుండగా రమ పరుగెత్తుకు వచ్చింది. ఇందాకటి నిరుత్సాహం మనిషిలో లేదు.

"అన్నయ్యా! ఆయనొచ్చారు."

అర్థం చేసుకోవడానికి రెండు నిమిషాలు పట్టింది. ఇతగా డెందుకు వచ్చాడబ్బా? కొంపతీసి. . .

"రండి, రండి, శంకరం గారూ! కులాసాగా ఉన్నారా?" కుశలప్రశ్నలు వేయడం సాగించాను.

"రమను తీసుకు వెళ్లడానికివచ్చాను." నా ప్రశ్నలన్నింటికి అదే సమాధానం అన్నట్టుగా చెప్పాడు శంకరం.

అనుకున్నంతా అయింది. అసలు కారణం ఇదన్న మాట, అతగాడి రాకకు.

"అదేమిటి? ఎలా తీసుకెళ్తారు!



గృహకృత్యం చిత్రం—గోలి శంకరరావు (తెనాలి)

రేపు లాయరును కలుసుకొని విడాకుల కోసం. . ."

నా వాక్యం పూర్తవకుండానే—"అంత శ్రమ మీ కేం వద్దులెండి. రమ వచ్చేస్తానంది" అంటూ నా తల మీద పెద్ద బాంబు వేశాడు.

అప్పటికే రమ సూట్‌కేస్ సర్దుకొని తయారయిపోయింది.

"అవునన్నయ్యా! నేను వెళ్లిపోవా లనుకుంటున్నాను. చేసిన తప్పు ఇప్పటి కన్నా సరిదిద్దుకోవడం మంచిది."

"అక్కడికి వెళ్లి ఏం బావుకుందామని? హాయిగా, మహారాణిలా బ్రతక మన్నాకూడా కష్టమేనా?" కోపంతో మాటలు సరిగ్గా రావడం లేదు నాకు.

"ఆ మాటలన్నీ ఇప్పు డెందుకన్నయ్యా!" అంటూ శంకరంవేపు తిరిగి, "పదండి, బయలుదేరుదాం" అన గానే, సూట్‌కేస్ పుచ్చుకు శంకరం బయలుదేరాడు.

రెండడుగులు ముందుకు వేసిన రమ, మళ్లీ వెనక్కి తిరిగి వచ్చి నా చేతిలో ఓ కవరు పెట్టి గబగబా వెళ్లిపోయింది.

జీవితంలో మొదటిసారిగా ఓడిపోయాననిపించింది. గుండెలోనుంచి తన్నుకొచ్చే దుఃఖాన్ని దిగమింగడానికి ప్రయత్నిస్తున్నాను.

"ఏమండీ! రమ వెళ్లిపోయిందా? ఇప్పుడే రామయ్య చెప్పితే తెలిసింది. ఎందు కెళ్లనిచ్చారు??" అంటూ వచ్చిన అరుణను చూడగానే నాలో కోపంకట్టలు తెంచుకొచ్చింది.

"మొగుడి సంగతి పట్టించుకోకుండా అందరూ నీలాగే ఉంటారనుకున్నావా? . . . గెటౌట్, డర్టీ క్రీచర్!" పెద్దగా అరిచాను.

బిత్తరపోయిన అరుణ గబగబా వెళ్లిపోయింది.

రోడ్డుమీద శంకరం, రమ కలిసి వెళ్లిపోతున్నారు. లోకాన్నంతా జయించిన వీరుడులా శంకరం పోజు, మహారాణి తీవి ఒలకబోస్తూ రమ కనుచూపుమేర దాటిపోయారు.

రమ నా చేతి కిచ్చిన కవరు విప్పాను. తెల్లటి కాగితంమీద నల్లటి అక్షరాలు.

"అన్నయ్యా,

ఆరేళ్ల క్రితం వరకూ నువ్వూ మాలానే ఉండేవాడివి. అందరిలా నవ్వుతూ, తుళ్లుతూ కాలం గడిపేవాడివి. కానీ, నీలో ఆ ఆనందం ఈనాడు కనిపించడం లేదు.

ఎందు వయస్సులో నీ జీవితం పాడయిపోయింది. అది నీలో గొప్ప పరివర్తన తెచ్చింది. ఇప్పుడు నువ్వు ఇతరులు నవ్వితే సహించలేవు. నీకు దూరమయిన సుఖాలు ఇతరులు అనుభవిస్తుంటే చూడలేక బాధపడుతున్నావు. అంతేకాదు, అలా బాధపడుతూ, వాళ్ల దగ్గర లేని, నీ దగ్గరున్న డబ్బు వెదజల్లి 'సుఖం అంటే ఇదే' అనే తప్పుడు అభిప్రాయం వాళ్లలో కలిగించాలని ప్రయత్నిస్తూ నిన్ను నువ్వే మోసం చేసుకుంటున్నావు.

నేనుకూడా నిన్ను చూసి మోసపోయాను. 'ప్రపంచంలో డబ్బుంటే మరేం అక్కర్లేదు' అనే అభిప్రాయం నాలో కలిగించావు. దానితో నాకు నా భర్త, నా ఇల్లు—అన్నీ నరకంగా కనిపించడం మొదలయింది. అంతవరకూ హాయిగా, ప్రశాంతంగా సాగుతున్న మా సంసారం వీథిని పడింది. అంతటితో ఆగకుండా ఇల్లు వదిలి నీ దగ్గరి కొచ్చేశాను.

ఇప్పటికి నాకు నిజం తెలిసింది. ఈ ఇంటిలో ఉన్న నగలు, చీరలు, ఫర్నిచరు ఇవ్వలేని సుఖం నా ఇంటిలో ఉంది. సుఖం అనేది మన కున్న ఆస్తిలో లేదు. మన మనస్సుల్లోనే ఉంది.

మరొక్క మాట. నీ మీద నా కేం కోపం లేదు— ఒట్టి జాలితప్ప. నీకు మాత్రం ఇతరులమీద జాలిపడే అధికారం లేదు. ఇప్పటికైనా నువ్వు కళ్లు తెరిచి మనిషిగా బ్రతుకుతావని ఆశిస్తున్నాను.

ఇట్లు,
—రమ.

తా. క. ఈ ఉత్తరం వ్రాయడం ముగించిన తరవాత ఆయనొచ్చారు నన్ను తీసుకువెళ్లడానికి. ఈ నెల రోజుల నుంచి నా మీది బెంగతో చిక్కి సగమయ్యారు. ఇక వెళ్లిపోతున్నాను."

రమా, నేనూ ఒకే తల్లిబిడ్డలం. కాని అదృష్టంలో చెరొక వేపు.

రణగొణధ్వనికి కిటికీలోంచి రోడ్డుమీదకు చూశాను.

అదుగో, పెద్దమ్మా, దేశ్యంగాడూ. వాడిపోయిన మొహాలతో ఇళ్లకు వెళ్లిపోతున్నారు. పెద్దమ్మ ఏమిటో చెప్పి పెద్దగా నవ్వుతూంది.

వెధవనవ్వూ వీళ్లూనూ! ఎందు కంత నవ్వు వస్తూంది వీళ్లకు?

మంచి బ్రతుకు కోసం ఉన్న చండాలపు బ్రతుకు వదులుకోవడం చేతగాని దద్దమ్మలు. రమా, పెద్దమ్మా, దేశ్యంగాడూ — వీళ్లంతా ఒక్కటే. ఒక్కళ్లకూ బ్రతకడం చేతకాదు. హాయిగా ఉన్నామనుకుంటూ ముదుగ్గుంటలో బ్రతుకుతున్నారు.

మరి, నేనూ. . . నేనూ. . . ★